
కథా నిలయం
6324
శ్రీకాకుళం



# వారసత్వం

వాళ్ళకొక పేరంటూ వున్నా ఊరంటూ మాత్రం లేదు. కడుపులో, కూడుకోసం వాళ్ళు రోజుకో ఊరు చేరతారు. చేరిన చోట తమ విద్యలు చూపించి జనాన్ని ఆకట్టుకుంటారు. కనికరించినవాళ్ళు వాళ్ళ కడుపులు నింపుతారు... కరుకుతనంతో వున్నవాళ్ళు కసురుకుంటారు.

ఏదేమైనా వాళ్ళు మాత్రం కష్టపడుతూ అడుక్కుంటున్న వారి క్రిందే లెక్క

వారికి తాత ముత్తాతల నుంచి వచ్చిన వారసత్వం పేదరికం... అందులో పుట్టినందుకు నేరంలా భావించి కృంగిపోవటం.... పై తరగతి వారిని చూసి అసూయ పట్టం.... యేడవటం... తమ బ్రతుకునే అసహ్యించుకోవడం అయితే కొంతమంది చేస్తారు. కాని వీళ్ళు మాత్రం తాతలు సంపాదించిన ఆస్తిపాస్తులు లేవనే విచారం తమలో యేమాత్రం ఇముడ్చుకోకుండా – తమ వారసత్వమైన విద్యల్ని నేర్చుకుంటారు... అవే తమ పొట్టల్ని నింపుతున్నాయని గర్విస్తున్నారు.

వాళ్ళని అందరూ "వీటి విద్యల" వాళ్ళంటారు. చిన్నపిల్లలు 'సర్కస్ వచ్చిందిరోయ్' అని చంకలు గుద్దుకుంటూ గెంతుతారు.

వారు ఎక్కువగా వెళ్ళేది పల్లెటూర్లే. కారణం యేదైనా వినోదం తమ ఊరొస్తే చూద్దామని... తహతహతో, గుండెల్లో సందళ్ళు నింపుకొని చూసేది వాళ్ళే.

పట్నాలలో అయితే ఎవ్వరూ వీరిని పట్టించుకోరు. అందుకే వీళ్ళూ పట్నాలను పట్టించుకోరు.

వారి భవితవ్యానికి పల్లెటూర్లే పట్టుకొమ్మలు.

అందుకే -

సూరీడు తూర్పు పర్వత శిఖరాగ్రాల్లో బంగారు బంతిలా మీదికొస్తున్న వేళ. వారా ఊరు చేరారు.

ఊరి నడిబొడ్డుకొచ్చాక చినిగిన చాప చుట్టల్ని... రెండు డప్పుల్ని... వెదురు బొంగుల్ని... యింకా యితరమైన సామాన్లని గుర్రం నుండి దింపారు.

వాళ్ళు మొత్తం నలుగురు, అందులో ఒక ఆడపిల్ల వుంది. ఓ చిన్న కుర్రాడున్నాడు. వయసులో వున్న యువకుడు, ఓ ముసలితాత వున్నారు. వారితో ఓ కోతిపిల్ల కూడా వుంది.

వాళ్ళలో ముఖం పీక్కుపోయినా నిగనిగలాడ్తున్న కండలున్నది సాంబడొక్కడికే! వాడి తండ్రి పెంచలయ్య ముసలి ముతకే అయినా టముకు మ్రోగించి వాళ్ళు పచ్చిన సంగతి ఊరి వాళ్ళకు విదితం చేసే బాధ్యత వాడిదే !

అందుకే ఆరోజు-పల్లెచేరిన వెంటనే పెంచలయ్య డప్పుతీసాడు. అక్కడే ఎండుపుల్లలుంటె దమట వేసి డప్పువెచ్చ చేసి యిచ్చాడు సాంబడు.

పెంచలయ్య చేతిలో డప్పు దద్దరిల్లి పోయింది.

'టమకుటమా...టమకుటమా...' పెంచలయ్య ఊగిపోతూ తాము 'వీటివిద్య' ప్రదర్శిస్తామని చెప్పసాగాడు. ఊరిపిల్ల కాయలు వారి చుట్టూ చేరటం మొదలు పెట్టారు.

కొంత సేపటికే కొంపలు తగలబడి పోయినట్లు యెవరో ఆసామి వచ్చి "ఏయ్ సర్కస్మనుషులూ ! ఏటి ఈ ఊర్లో సర్కస్ యేస్తారా ? ఏంది ? అయితే యిక్కడ యేయాలంటే ముందు బుగతగారి అనుమత్తీసుకోవాలి" అన్నాడు.

"బుగతగారా ! విస్తుబోయి భృకుటి ముడిచి అన్నాడు పెంచలయ్య.

"అదే ఈ ఊరిమారాజు... గంగుల్నా యుడుగోరు... ఆ బాబుమాటవన్దే ఎవుడూ యేపనిసేయడాన్కి ఒల్లకాదంతే. ఎల్లం డెల్లండి... ఆ బాబుని కల్సుకుని యిద్దెలు మొదలెట్టండి" అని అదిలించాడు. పెంచలయ్యకు, సాంబడికి గమ్మత్తుగా అనిపించింది. ఇప్పటిదాకా తాము యెన్నో ఊర్లుతిరిగారు. కాని ఈ విధంగా ఆదిలోనే ఆంక్ష పెట్టిన బాపతునెక్కడా యెవర్నీ చూడలేదు. అయినా ఊరికట్టు బాటుని తిరస్కరించడం మంచిది

కాదని అనుకుని గంగుల్నాయుడిని కలుసుకోవడానికి ఆతృతపడ్డారు.

గంగుల్నాయుడికి ఆ చుట్టు ప్రక్కల చాలాపేరుంది. తిమ్మినిబమ్మిని, బమ్మినితిమ్మిని చేసి జనాలచేత కూడా బుర్రూపించి, అదే న్యాయమనిపించగల మహా తెలివైనవాడు. లక్షలు సంపాదించినా తృప్తిపడక యింకా డబ్బు యావలోనే వున్నాడు.

ఎలా సంపాదించాడంటూ యెవర్నైనాఅడిగితే బుర్రలు మార్చి అనిచెప్పక తప్పదు. మొదట గంగుల్నాయుడిని యెవరో పెంచుకోవడానికి తీసుకు వెళ్తే అతను తన వుంపుడుకత్తె సలహాతో అతడ్ని చంపేసి అతని వెనుకగల ఆస్తి పాస్తుల్ని పడేసుకుని దాంతో యింత బ్రతుకూ బ్రతుకుతున్నాడని అంటారు.

కొద్దిమంది – పొగాకు వ్యాపారంలో కష్టపడి పైకొచ్చాండటారు.

ఏమైతేనేం- ఇప్పుడు గంగుల్నాయుడు పెద్దమనిషి, ఊరికి దేముడు.

అందరూ దేముడిలా భావించే నాయుడి విగ్రహం మాత్రం దేముణ్ణెదిరించే రాక్షసుడిలాగుంటుంది. గారపళ్ళు, కండ పట్టిన శరీరం, బానలాంటి పొట్ట, కొయ్య జుత్తు చూడటంతోటే ఎదుటి మనిషికి మూర్ఖంగా కనిపిస్తాడు.

అలాంటి ఉగ్రరూపి అయిన గంగుల్నాయుడి మాటకు యెవరెదురొచ్చినా వాడి బ్రతుకు బుగ్గే... అది మాత్రం ఖాయం !

పెంచలయ్య, సాంబడు వెళ్లేసరికి కళ్లంలో పెద్ద పట్టిమంచం మీద కూర్చున్నాడు. నల్ల తుమ్మ మొద్దులావున్నాడు.

మంగలి ఒళ్ళు పడుతున్నాడు.

ఎదుటిగా వెళ్ళి దండాలు పెట్టారిద్దరూ 'ఎవరన్నట్టు'గా చూశాడు గంగుల్నాయుడు.

"మేం ఈటి విద్యలోల్లం.... ఈ యేల తమలాటి బాబుల కాడ మా యిద్దెని పెదర్శించాలని వచ్చినాం. మీరు కనిరికరించాల... ఈ వూల్లో సరకసేసుకోవటానికి తమరొప్పుకోవాల... ఆ పై తమరి దయ" పెంచలయ్య గొంతు దీనంగా, హీనంగా వుంది ఆమాటలన్నప్పుడు.

"మీ పేర్లేటి?" అడిగాడు కరుగ్గా, నిర్లక్ష్యంగా నాయుడు.

చెప్పారిద్దరూ.

"సూడండి... ఈ ఊర్ల యే దెట్టినా నా కడగటం పరిపాటి. ఊరి ఆసారం పాటించినందుకు సంతోషం... ఈ యేల సాయం తరం అంతా రచ్చబండ కాడ సేర్తాం...

అప్పుడు మీ యిద్దెల్ని పెదర్శించండి... మీకు ఆడ బాగా సొమ్ములు దొరుకుతాయి... ఆఁ!" మీసం ఒకసారి త్రిప్పి చెప్పాడు నాయుడు.

నాయుడు మాటలు అమృతంలా సోకాయి "చిత్తం బాబయ్యా ! పదికాలాల పాటుండాల, మీలాంటి బాబులు... దరమ పెబువులు... వత్తాంబాబయ్యా !" వంగినమస్కరించాడు పెంచలయ్య. సాంబడు కూడా దండం పెట్టాడు. అక్క ణ్ణుంచి కదిలారిద్దరూ.

వాళ్ళు వెళ్ళేసరికి అంతా ఎదురు చూస్తున్నారు.

"తాతా ! ఈ యేల ఆటైడం అవుద్దా? యేటీ సెప్పక యెందుకలా నిలబడ్డావు" అంది పెంచలయ్య మాటాడకపోవడం చూసి–అతని మనవరాలు సింగి.

ఔను పెంచలయ్యకు మాటలు యెలా వస్తాయి !

పెద్దోరి మాటైంది కనుక తాము విద్దెలు చూపిస్తే కనక వర్షం కురుస్తాది... తప్పదు ఇప్పటికే సాలా మంది సర్కస్ చూడ్డానికి యెగబడుతున్నారు. అందువల్ల వాళ్ళు చప్పట్లు కొట్టేట్లు చేస్తారు తాము.

"ఔనేసింగీ ! తాతకెలా మాటొస్తుందే? ఆ బాబు సానా మంచోరునాగుంది. అడగ్గానే ఒప్పేసుకున్నాడు. ఈ మద్దేన్నం నాల్గంటలకి ఆట మొదలెట్టాల" అని కూతురు సింగికి ఇదమిద్ధమని చెప్పలేని సంబరంతో చెప్పాడు తడబడే మాటల్తో సాంబడు.

సింగికి, చిన్నోడికీ తండ్రి మాటలు ఆనందం తెచ్చి పెట్టాయి. వారందరికీ ముందు ఊరివాళ్ల కట్టుబాటు యెంతవింతనిపించిందో – నాయుడొప్పుకున్నాక మరింత సంతోషం కల్గింది.

తర్వాత–సాంబడు గుర్రాన్ని మేతకు లాక్కెళ్ళాడు.

చిన్నోడు కోతికి అరటిపళ్ళు తినిపించసాగాడు.

రెండు రాళ్ళతో పొయ్యిచేసి వంట మొదలెట్టింది సింగి. డప్పు బాగా మ్రోగటానికి కాలుస్తున్నాడు పెంచలయ్య.

అప్పటికే చిన్న పెద్ద–వీర్ని విడ్డూరంగా తిలకిస్తున్నారు. పిల్లలైతే "ఎన్ని గంటలకు సర్కసంటూ" కుతూహలంగా ప్రశ్నిస్తున్నారు.

"సాయంత్రం" అంటూ ప్రతివాళ్ళకూ విసుగులేకుండా జవాబిస్తున్నారు.

సాయంత్రమైంది.

రచ్చబండ కళకళల్లాడుతోంది. పెద్ద వాళ్ళంతా ఆశీనులై వున్నారు.

గంగుల్నాయుడు అందరికన్నా కొద్దిగా ఎత్తుగా కుర్చీలో కూర్చుని వున్నాడు. మిగతా అందరూ రచ్చబండ దిగువున చాపలు పరుచుక్కూచున్నారు.

పిల్లలు మాత్రం వర్తులాకారంగా నిలబడ్డారు. సింగి పిల్లలందరినీ వరుసగా కూర్చోపెట్టడానికి ప్రయత్నిస్తోంది. సాంబడు రెండు పెద్ద పెద్ద రాళ్ళు పట్టుకొచ్చి పెట్టాడు. ఎవరిదో సైకిల్ ఒకటి, చెక్క బెంచీ ఒకటి తెచ్చాడు.

పెంచలయ్య మళ్ళా డప్పు వేడిచేసి వాయించడం ప్రారంభించాడు. శివుడి ఢమరుకంలా మార్మోగిపోతోంది. దగ్గరగా వున్నవాళ్ళు చెవులు చిల్లులు పడిపోతాయని భయంవల్ల కాబోలు మూసుకుంటున్నారు.

సాంబడు మొదలెట్టాడు.

"ఈ రోజు యీ బాబులంతా... మన యిద్దెల్సూడటానికి వచ్చినారు... ఐతే మనం ఎంతో సాహసంతో... సేత్తున్నామని వీరికి సెప్పనక్కర్లేదు... పెతీ పనీ కూడా పానాల్తో సెలగాట మాద్దం నాటిదే. అందొల్ల మేం సేసీపని సూసి... మా యిద్దెలన్నీ గమనించి సంతోషంతో తమరికి తోసిన కాడకి దరమం సేత్తారని ఆశిత్తన్నాం !"

కొడుకు అనే ప్రతీ మాటకూ 'అయిసా' 'భళిభళి' అంటూ డప్పుని రెండు దరువులు వేస్తున్నాడు పెంచలయ్య. సింగి పిల్లల చేత చప్పట్లు కొట్టించింది.

పెద్దగా ఈల వేశాడు సాంబడు. రెండు బండరాళ్ళను ఒకదానిపై ఒకటి పెట్టి మోచేత్తో మోదటం మొదలెట్టాడు. నిముషంలో అది రెండుగా విడిపోయింది. తర్వాత ఇట్నుంచి అటు... అట్నుంచి యిటు పిల్లిమొగ్గలు వేశాడు. 'హె హె హె' అని అరుస్తూ కండలు చూపిస్తున్నాడు.

అంతా చప్పట్లు కొడుతూ ఈలలు వేశారు.

తర్వాత పెంచలయ్య చెప్పసాగాడు.

"ఈ పిల్లకు పదేళ్ళుంటాయి... సింగి బాబూ దీనిపేరు. యెంతో దైర్యంగల పిల్ల. ఈపిల్ల తాడు మీద నడిచి వస్తోంది. ఇది యెవురూ సెయ్యలేని పని... ఎందుకంటే ముందుకు పడితే మూతిపళ్ళు... ఎనక్కుపడితే ఎన్నుపూస యిరుగుద్ది. సూసాక బాబులికే తెలుస్తాది" అది సింగిని రెండురాటలక్కట్టిన తాడు మీద కెక్కించాడు.

సింగి యెంతో నేర్పుతో రెండు చేతులతో ఒక వెదురు పట్టుకుని ఒడుపుగా బ్యాలెన్స్ కాసుకుంటూ అటూ ఇటూ నడిచింది.

జనం ఆనందంతో కేకలు వేశారు. గంగుల్నాయుడు కూడా "శభాష్!"అనుకుని

మీసం మెలేసాడు. అద్దైపోయింది.

సింగి అటూ ఇటూ రెండు సార్లు పిల్లిమొగ్గలు వేసింది. చిన్నోడు కోతిచేత నాట్యం చేయించాడు. రింగులోంచి దూకించాడు.

తర్వాత సాంబడు గుర్రాన్ని రెండు మూడు సార్లు శరవేగంగా స్వారీ చేసి నడిపాడు. పరుగెడ్తుండగా దానిపై నిలబడ్డాడు.

అంతా 'ఓహ్' అన్నారు. ఉత్కంఠగా చూస్తున్నారు.

సైకిల్‌ని తీసాడు సాంబడు. దాన్ని నిలువుగా పంటితో పట్టుకుని ఒడుపుగా పైకిలేపి చేతులు వదిలాడు. పెంచలయ్య – 'ఈ యిదంగా యెవురైనా సేత్తే పల్లూడిపోతాయి. మీద పడితే యెముకలిరిగిపోతాయి' అని వ్యాఖ్యానించాడు.

తర్వాత చెక్క బెంచీని కూడా అలాగే నిలబెట్టాడు. సర్కస్ అయిపోవచ్చింది. ఇక మిగిలింది ఒకే ఒకటున్నాది.

"మంటల్లో నుంచి దూకటం. సూడండి బాబులూ!" అంటూ ఓ పెద్ద ఇనుప రింగుకు కిరసనాయిల్లో తడిపిన గుడ్డలు చుట్టి నిప్పంటించాడు. అది భగ భగ మండసాగింది.

సాంబడు దూరంగా వెళ్ళి ఆ రింగులోంచి దూకాడు. ఆ వెంటనే సింగికూడా దూకింది. అలా మూడు సార్లు జరిగింది.

మళ్ళా చప్పట్లు మార్మోగాయి.

చిన్నోడు కోతి తలపై సిల్వర్ పళ్ళెం పెట్టి ప్రతివారి దగ్గరకూ వెళ్ళితోచినంత వెయ్యమంటూ అడుగుతున్నాడు.

అందరూ తలాకొంత వేయసాగారు. పెంచలయ్య గంగుల్నాయుడి గారి వద్దకు వెళ్ళాడు.

చివరగా "ఇదిగో నావి రెండువందలు" అని ఇచ్చాడు.

పెంచలయ్యకు అంత సొమ్ము ఒకసారి కళ్ళబడటంతో ఉబ్బితబ్బిబ్బయి పోయి మాటపెగల్లేదు.

సాంబడు అదిచూసి "బాబుగారు ఈ ఊర్ల సరకస్ పెట్టుకోవడానికి ఒప్పుకోవడమేకాక రెండొందల రూపాయలు దయసేసినారు..... ఆ బాబుని దేవుడు సల్లంగసూడాల... "అని డప్పుని ఓ మారు మ్రోగించాడు.

గంగుల్నాయుడివ్వడం చూసి మరికొందరు వంద, యాభై, పాతిక, పది ఇవ్వటం

మొదలెట్టారు.

ఏ ఊరు వెళ్ళినా ఎంత కష్టపడినా రెండు మూడు రోజులుండి యెంతబాగా చేసినా ఇంత డబ్బు రాలేదు. 'కలా! నిజమా! అనిపించింది వారికి, అంతా వెళ్ళిపోయారు.

"ఈ యేల లెగ్గానే సింగి మొహం సూసినాను. అందుకే ఈ దినం బంగారం పండింది" అని పొగిడి సింగిని ముద్దు పెట్టుకున్నాడు పెంచలయ్య.

చిన్నోడది చూసి మురిసిపోయాడు. వాడికంతా ఎందుకో పండగలా వుంది. సాంబడు అన్నీ సర్దుతున్నాడు. పున్నమివెన్నెల పుడమిపై పిండారబోసినట్టు పాకుతోంది.

"ఈ రేతిరికి బయలెల్లిపోయి పక్కూరు యెల్లాక గంజికాచుకుందాం" సాంబడు అన్నాడు.

"ఔనోరి... యెన్నెల కదా ! ఎల్లి పోదాం" పెంచలయ్య అంగీకరించాడు.

వారి దగ్గరకు ఒకడొచ్చాడు. వాడు పెంచలయ్యతో "నాయుడు బాబు గమ్మంటున్నారు" అని చెప్పాడు.

"అలాగే బాబయ్యా... మే మెలాగా ఆ బాబు దర్శనం సేసుకునే యెల్దామని అనుకుంటున్నాం" అని పంపేశాడు సాంబడు. ఆ వెంటనే సింగిని, చిన్నోడిని అక్కడుంచి వాళ్ళు కదిలారు.

ఆ సరికే గంగుల్నాయుడు కళ్ళంలో కాలు మీద కాలేసుకుని దర్జాగా సింహంలా వున్నాడు. లంక పొగాకు చుట్ట కాలుస్తున్నాడు.

తెల్లని కల్లీ లాల్చీపై వెన్నెలపడి లోనున్న బంగారపు గొలుసులీలగా తళు క్కుమంటోంది.

ఎదురుగావెళ్ళి "దండాలయ్యా" అని వంగి దండం పెట్టారు సాంబడూ, పెంచలయ్య.

"ఆc!.. ఆc!.. యేటర్రా. మీరిద్దరూ మా బ్రహ్మాండంగా సేసినారు. రెండు కల్లుసాల్లేదంటే నమ్ము ఆ ఇంతకీ యీ యిద్దెల్ని యెన్నిసార్లు పెదర్శించారు?" అడిగాడు చుట్టనుసి రాలుస్తూ.

"నెక్కనేదు బాబూ ! యెన్నూర్లో తిరిగినాం... మా సిన్నతనంకాడ్నుంచీ మా తండ్రుల్తో పాటే తిరుగుతున్నాం... ఆళ్ళు పెట్టిన బిచ్చమిది... అందుకే లాభమైనా, నష్టమైనా ఒదులుకోనేక పోతున్నాం" అని పెంచలయ్య వివరించాడు.

"అసలీ యిద్దెలు మీకెలా గబ్బినాయిరా?" గంగుల్నాయుడు వుత్సుకతతో

ప్రశ్నించినట్టనిపించించింది పెంచలయ్యకు

"అదే బాబయ్యా ! ఒక వంశంలో యేగునవైనా, యిద్దెయినా వొంశపారంపరంగా వత్తాది. అందులోనూ సిన్నప్పటి కాడ్నుంచి మా యెవుకలు ఒంచీసి... అబ్బేసం సేయించీవోరు, మేం యింకా పేక్టీసు సేసినేరుసుకున్నాం... ఏదేమైనా బాబూ... ఈ యిద్దెలకి అబ్బేసం ముక్కెం"

"అయితే అబ్బేసం కావాలంటావు ! అయితే యింతకీ వూళ్ళో యీ యేల యేపాటి దొరికిందంటావ్?" అని ప్రశ్నించాడు నాయుడు.

"ఏదో బాబూ ! తమరి దయవల్ల ఓ ఆరొందలు దొరికినాయి బాబయ్యా ! యేదో ఓనెల కూడు దొరికిందయ్యా ! మీ మేలు జనమలో మర్సిపోమయ్యా" కృతజ్ఞతతో పలికాడు పెంచలయ్య మనసులో ఆనందం చిలుకుతూంటే.

"ఏదా సొమ్మిలాగీ !" అడిగాడు గంగుల్నాయుడు చుట్టను తన చెప్పు కింద రాస్తూ.

ఎందుకో అర్థంకాక పోయినా జేబులోంచి సొమ్ము తీసి గంగుల్నాయుడి చేతిలో పెట్టాడు సొంబడు. వాట్ని లెక్కెట్టి అందులో సగం తీసుకుని మిగతాది సొంబడికి అందించాడు.

సొంబడు అది అందుకున్నాడే గాని రాతిబొమ్మే అయ్యాడు. పెంచలయ్య నివ్వెరపోయాడు.

"అదేట్రా అలాగ యిసిత్రంగా కల్లప్పగించి సూత్తారు... యీ ఊర్ల యేజ్జరిగినా నా అనుమత్లేకుండా జరగదు... ఏపాటి కలక్సనొచ్చినా అందులో నా వాటా సగం నాకు దక్కాల... నేనే ఆడ రొండొందలు మొదట్నే యియ్యకపోతే యెవ్వళ్ళైనా యేత్తారేటి?... గొర్రెల్లాటి జనం నన్ను సూసి మీకేసారు... అంతేగాని నీ యిద్దెనిసూసి పొంగిపోయికాదు... నా పరపతి వల్లే నీకు ఇన్ని డబ్బులు రాలాయి. మరే ఊర్లయినా మీరిన్ని సొమ్ములు కల్లజూసార్రా?" గద్దించి అడిగాడు.

జవాబు చెప్పలేక నిలుచుండిపోయారు ఆ ఇద్దరూ ! వెళ్ళిపోతున్నవాళ్ళు తాతముత్తాతల వారసత్వంగా ఎంతో అభ్యాసంతో వీటి విద్యల్ని నేర్చుకున్నారు.

వాళ్ళని చూస్తూ మీసాలు దువ్వుకుంటూ వికటంగా నవ్వుకుంటూన్న గంగుల్నాయుడు కూడా తాత ముత్తాతల వారసత్వంగా ఒక విద్యను అభ్యసించాడు.

దాని పేరు..... "దోపిడి".

(స్వాతి మాస పత్రిక – ఫిబ్రవరి, 1986)